క్లుప్తంగా

ప్రారంభమైన కల్యాణ మండపం నిర్మాణ పనులు



కారెంపూడి: స్థానిక ఎస్సీ (మాదిగ) కల్యాణ మండపం నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. భవన నిర్మాణ పనుల్లో ఎస్సీలు పాలుపంచుకున్నారు. పునాదులు తీసి కంకర వేసే పనులు జరిగాయి. ఇక్కడ 15 సెంట్ల స్థలంలో ఎస్సీలకు కల్యాణ మండపం నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇటీవల భూమి పూజ చేశారు. మండపం నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు కూడా మంజూరు చేశారు. ఎంతో కాలంగా కమ్యూనిటీ అవసరాలకు సరైన వేదిక లేక రోడ్ల పైనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాల్సి వస్తోందని తమ ఇబ్బందులు గమనించి ప్రభుత్వ విప్ పీఆర్కే స్థలమిచ్చి నిధులు మంజూరు చేయడంపై ఆ ప్రాంత ఎంపీటీసీ అంతరగడ్డ ఏసోబు, సంఘ పెద్దలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోలేరమ్మకు కుంకుమ బండి



కారెంపూడి: మండలంలోని ఇనుపరాజుపల్లె గ్రామంలో సోమవారం రాత్రి పోలేరమ్మ అమ్మవారికి గ్రామస్తులు కుంకుమ బండి కట్టి జాతర నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి పాల్గొని కుంకుమ బండికి కొబ్బరి కాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. కొరకూటి ఆంజనేయులు, నల్లమేకల శ్రీను, యనమదల శ్రీను తదితరులు అమ్మవారికి కుంకుమ బండి కట్టారు. పార్టీ నాయకులతో ఆలయానికి తరలివెళ్లి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తగరం బుజ్జెమ్మాయి శేఖర్, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్‌లు క్రిష్ణపాటి అంకిరెడ్డి, యరసాని కోటిరెడ్డి, మోర్తల కోటిరెడ్డి తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



కారెంపూడి: వాసవి క్లబ్ కారెంపూడి శాఖ కార్యవర్గ ఎన్నిక మంగళవారం జరిగింది. క్లబ్ అధ్యక్షుడుగా కర్నాటి నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా ఆతుకూరి భాస్కర్, కోశాధికారిగా వెచ్చా ఉమా మహేష్‌లు ఎన్నికయ్యారు. ఎన్నిక నిర్వహణలో వివిధ హోదాల ఆర్యవైశ్య సంఘాల జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రతినిధులు భవిరిశెట్టి రామారావు, ముచ్చర్ల రామకోటేశ్వరరావు, పొట్టి హనుమంతరావు, కజయం విజయలక్ష్మి, అర్వపల్లి సత్యనారాయణరాజు, జి లక్ష్మీరాజ్యం, గుండా వెంకట ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

తమలపాకుల అలంకారంలో అమ్మవారు దర్శనం



పిడుగురాళ్ల: పట్టణంలోని నాలుగుగుడి దేవస్థానంలో వసంత నవరాత్రుల్లో భాగంగా మహాసరస్వతి అమ్మవారిని తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. హాజరైన భక్తులకు ఆలయ పూజారి వెంకటేశ్వర శర్మ తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు కాచవరంలో గ్రామోదయం

కారెంపూడి: మండలంలోని కాచవరం గ్రామంలో బుధవారం ఉదయం గ్రామోదయం కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ శ్రీనివాస్ మంగళవారం సాయంత్రం తెలిపారు. కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశాల మేరకు కాచవరం గ్రామంలో మండల నోడల్ టీమ్ పర్యటించి గ్రామంలో ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించే కార్యక్రమం జరుగుతుందన్నారు. వేకువజాము నుంచే గ్రామంలో నోడల్ టీమ్ అధికారులు ప్రతి బజారులో పర్యటించి ప్రజలు చెప్పే ప్రతి సమస్యను నోట్ చేసుకుని సంబంధిత శాఖల అధికారులు వాటిని పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

31న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 31న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్లో జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి మంగళవారం తెలిపారు.

ఉద్యోగులు క్రీడల్లోనూ రాణించాలి

- సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి
- ఉద్యోగుల కలెక్టర్స్ ట్రోఫీ డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



ఉద్యోగుల కలెక్టర్స్ ట్రోఫీ డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీఓ రాజకుమారి, అధికారులు

సత్తెనపల్లి: ఉద్యోగులు వృత్తితో పాటు క్రీడల్లోనూ రాణించాలని సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి చెప్పారు. పల్నాడు జిల్లా తొలి ఆవిర్భావ సంవత్సరికంను పురస్కరించుకుని పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల కలెక్టర్స్ ట్రోఫీ డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఆర్డీఓ రాజకుమారి మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులు ఉపశమనం పొందేందుకు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల్లో రాణించే ఉద్యోగులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ముందుగా పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. సత్తెనపల్లి డివిజన్‌లో ఒక పట్టణం, తొమ్మిది మండలాల నుంచి సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ తదితర ఉద్యోగులు మొత్తం 10 జట్లు హాజరయ్యాయి. ఈ పోటీల్లో అచ్చంపేట-బెల్లంకొండ తలపడగా అచ్చంపేట, సత్తెనపల్లి టౌన్- అమరావతి తలపడగా సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్-రాజుపాలెం తలపడగా సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ-పెదకూరపాడు తలపడగా పెదకూరపాడు, అచ్చంపేట-నకరికల్లు తలపడగా అచ్చంపేట జట్లు గెలుపొందాయి. ఏపూల్‌లో అచ్చంపేట, సత్తెనపల్లి టౌన్ జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. బీ పూల్‌లో ముప్పాళ్ళ జట్టు సెమీఫైనల్‌కు చేరింది. సత్తెనపల్లిరూరల్-రాజుపాలెం ఆడాల్సి ఉండగా బుధవారానికి వాయిదా పడ్డాయి. బుధవారం సెమీఫైనల్ అనంతరం ఫైనల్ పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో సత్తెనపల్లి మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌డీఓ ఏ. సుధాకర్, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, తహసీల్దార్ కె.నగేష్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, ఎంపీడీఓలు శ్రీనివాసరెడ్డి(నకరికల్లు),ఎం.శ్రీనివాసరావు(ముప్పాళ్ళ), శ్రీనివాసరావు(రాజుపాలెం), నరసింహారావు(పెదకూరపాడు),శివరామయ్య(క్రోసూరు), టోర్నమెంట్ ఇన్‌చార్జి ఏ శ్రీరామి రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు ఐఎస్. నాగిరెడ్డి, ఎస్ఎం సుభాని, ఎస్‌కె.ఎమ్‌డీ రియాజ్, పీ.శ్రీనివాసరెడ్డి, డీ శ్రీనివాసరావు, ఏ చెన్నయ్య, ఎస్ అచ్చిరెడ్డి, వి. వేమారెడ్డి, తులసి నాయక్, అనిల్, శాంతి, స్వరూప్, క్రాంతి, ఉద్యోగులు, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ డిపోలో ఖాళీ స్థలానికి టెండర్ల ఆహ్వానం



సమావేశంలో మాట్లాడుతున్న డిపో మేనేజర్

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మూడు ఖాళీ స్థలాలు ఉన్నాయని, వాటికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్. ముక్తేశ్వరరావు మంగళవారం తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ డీఎం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్టీసీ డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో మూడు ఖాళీ స్థలాలు లీజుకు ఇచ్చేందుకు టెండర్లు ఆహ్వానించామని, ఈ లీజు ఐదు సంవత్సరాల వరకు అనుమతి ఉంటుందన్నారు. అదేవిధంగా కారంపూడి బస్టాండ్‌లో షాపులు కూడా ఇచ్చేందుకు టెంటర్ ఆహ్వానిస్తున్నామన్నారు. అదేవిధంగా దక్షిణ భారతదేశంలో పుణ్యక్షేత్రమైన అరుణాచలం దేవాలయానికి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ బస్సు ఏప్రిల్ 4వ తేదీ రాత్రి 10 గంటలకు ప్రారంభమై నర్సరావుపేట, అద్దంకి, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపు, కాణిపాకం మీదుగా అరుణాచలం వరకు వెళ్తుందని, తిరుగు ప్రయాణం 7వ తేదీ ఉదయం 8 గంటలకు పిడుగురాళ్లకు చేరుతుందన్నారు. ఈసర్వీస్ నంబర్ 360112 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ బస్సుకు సంబంధించిన సమాచారం ఈ సర్వీస్ నెంబర్‌ను ఆన్‌లైన్లో కొట్టి చూసుకోవచ్చునన్నారు. ఈ బస్సు సౌకర్యానికి రూ. 2500 చార్జి తీసుకోవడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సెల్ నెంబర్: 9849556384 నంబర్‌కు సంప్రదించాలని ఆర్టీసీ డీఎం ముక్తేశ్వరరావు వివరించారు.

ఆత్మ విశ్వాసంతో కృషిచేస్తే ఉన్నత శిఖరాలు

తహసీల్దార్ పుల్లారావు



విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు

రెంటచింతల: ప్రతి ఒక్క విద్యార్థి ప్రణాళికాబద్ధకంగా ఆత్మ విశ్వాసంతో కృషిచేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు అన్నారు. మంగళవారం బడినిద్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఇక్కడ మీరు చదువుకోవడానికి ఏమైన ఇబ్బందులు ఉన్నాయా..మౌలిక వసతులు ఎలా ఉన్నాయి..మెను ప్రకారం ఆహారం పెడుతున్నారా.. అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో జరగనున్న 10వ తరగతి పరీక్షలకు ఎంత మంది విద్యార్థులు హాజరౌతున్నారు...పరీక్షలకు ఎలా చదువుతున్నారు..ఉపాధ్యాయులు పాఠశాలలో చెప్పిన పాఠాలను ఒక ప్రణాళికాబద్ధకంగా చదివి మంచి ఫలితాలను సాధించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యాభివృద్ధికి అనేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు మంచి పరిపూర్ణమైన ఆరోగ్యం పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కష్టపడితేనే మంచి భవిష్యత్ ఉంటుందని విద్యార్థులు గుర్తించి క్రమశిక్షణ కలిగిన విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో పల్లా రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి విద్యార్థిని రక్తహీనతతో బాధపడకూడదని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా మంగళవారం పట్టణంలోని సొసైటీ కాలనీ ప్రాంతంలోని కిట్స్ పాఠశాలలో మున్సిపల్ కమిషనర్ వి.వి.రమణబాబు ఆధ్వర్యంలో 270 మంది విద్యార్థినులకు రక్తహీతన పరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ శాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ లక్ష్మీప్రసన్న వైద్య పరీక్షలు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, సచివాలయ నర్సులు డి. కుమారి, పుష్పలీల తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ జంగా పర్యటన

దాచేపల్లి : మండలంలోని గామాలపాడు గ్రామ సమీపంలోని నాయకురాలు నాగమ్మ దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి బుధవారం సందర్శిస్తారని సర్పంచ్ జంగా సురేష్ మంగళవారం తెలిపారు. ఈ దేవాలయాన్ని సందర్శించి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారని, పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న ఈ దేవాలయాన్ని ఆధునికీకరణ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని సర్పంచ్ సురేష్ చెప్పారు.

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు

దాచేపల్లి : ఇంటర్మీడియట్ ప్రథమ పరీక్షలు మంగళవారం ముగిశాయి. నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఆఖరి రోజు జరిగిన ప్రథమ సంవత్సర పరీక్షకు 526 మంది విద్యార్థులకు 505 మంది విద్యార్థులే హాజరైయ్యారు. 22 గదుల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చారు.

శక్తివంతమైన ఆయుధం విద్య

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: విద్య నీడ లాంటిది మన నుంచి దానిన్ని ఎవరు వేరు చేయలేరు, ఈ ప్రపంచాన్ని మార్చాలంటే శక్తివంతమైన ఆయుధం విద్య ఒక్కటేనని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నవీనా టెక్నో స్కూల్ 30వ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు అనేది ఒక మనిషికి ఎంతో అవసరమన్నారు. మనిషి జీవనశైలిని మార్చగలుగుతుందన్నారు. పేదవాడు కొడుకును డబ్బున్న వారిగా చేయగలిగేది చదువు మాత్రమేనని ఆయన తెలియజేశారు. మామూలు మనిషిని ప్రపంచమే తన వైపు చూసేలా చేయగలిగేది చదువు మాత్రమే అంత గొప్ప ఆయుధం చదువు అని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుఉంది. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్‌లు బాలగంగాధర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డిలు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్‌గా నవకుమార్



అంబటి నవకుమార్

దాచేపల్లి : గురజాల నియోజకవర్గం బీజేపీ కన్వీనర్‌గా దాచేపల్లి మాజీ ఎంపీపీ అంబటి నవకుమార్ నియమితులైయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మంగళవారం జాబితా విడుదల చేశారు. నవకుమార్ ప్రస్తుతం ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్నారు. నవకుమార్ నియమకం పట్ల మండలశాఖ అధ్యక్షుడు యరమోతు ప్రభాకర్‌రావు తదితరులు అభినందించారు.

నేడు పాలువాయిగేటులో గ్రామోదయం

రెంటచింతల: మండలంలోని పాలువాయిగేటు గ్రామంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు బుధవారం గ్రామోదయం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు మంగళవారం తెలిపారు. ఉదయం 7గం. నుంచి 9 గం.ల వరకు గ్రామ సర్పంచ్ గొలమారి నాగలక్ష్మి శ్రీనివాసరెడ్డి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఏపి ట్రాన్స్‌కో ఏఈ మస్తాన్‌వలి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఈవోపీఆర్డీ రామచంద్రరావు, ఏపీఎం వెలుగు చిన్నబాబు, క్లాప్‌మిత్రలతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలోని డంపింగ్ యార్డు వద్ద సంపదసృష్టిపై చర్చించి గ్రామానికి అదనపు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

బ్రహ్మనాయుడు కాలనీలో వైద్య సేవలు

కారెంపూడి: బ్రహ్మనాయుడు కాలనీలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపెయిన్ (ఎఫ్‌పీసీ)ను మంగళవారం గాదెవారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ ఎం విజయానాయక్ నిర్వహించారు. కాలనీలో దీర్ఘకాలిక వ్యాధులతో మంచాలకే పరిమితమైన రోగుల ఇళ్లకు డాక్టర్ వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని తగిన సూచనలిచ్చారు. తమ ఇంటి వద్దకే డాక్టర్ రావడం పట్ల రోగులు సంతోషం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే 104 సిబ్బంది కాలనీ బీపీ, షుగర్ లాంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌ఓ రత్నకుమారి, టి వెంకటరత్నం, శివసుధాకరరెడ్డి, శ్రావణి, అవినాష్, శ్రీనివాసరావు ఆశ కార్యకర్తలు నాగమల్లేశ్వరి, రమణ, శివపార్వతి, సుజాత వైద్య సేవలందించారు.

చలో ఢిల్లీ గోడ పత్రిక ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, రైతు సంఘం నాయకులు

పిడుగురాళ్ల : ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో జరిగే రైతు ఉద్యమాన్ని జయప్రదం చేయాలంటూ రైతు, కార్మిక సంఘాలు, సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని మాచర్ల బస్టాండ్ వద్ద గోడపత్రికను ఆవిష్కరించారు. ఈసాందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నరేంద్రమోడి ప్రభుత్వం గత తొమిది సంవత్సరాలుగా వ్యవసాయ వ్యతిరేక విధానాల వల్ల రైతులు అప్పుల పాలై వ్యవసాయం గిట్టుబాటుగాక దీన స్థితిలో ఉన్నారని ఆయన తెలియజేశారు. వారిని ఆదుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవట, కార్పొరేట్లకు దోచి పెట్టే విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తోందన్నారు. రైతులకు సౌకర్యం కల్పించాలని ఏప్రిల్ 5 తేదీనా జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికులు పెద్ద ఎత్తున్న పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బుంగా నాగేశ్వరరావు, గద్దం కోటేశ్వరరావు, కాటమరాజు, ధీకొండ వెంకటేశ్వర్లు, ఏజెంట్ పాపారావు, పెరుగు కొండలు, ఏసుబాబు, దైవ నాగేశ్వరరావు, జల్లి శివ తదితరులు ఉన్నారు.

వడ్డీ రాయితీని వినియోగించుకోండి

గురజాల : నగర పంచాయతీకి చెల్లించాల్సిన ఇంటి పన్నులు, నీటి పన్నులు వడ్డీ రాయితీతో వినియోగించుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన శ్రీనివాస్ తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులు వడ్డీ లేకుండా చెల్లించుకునే విదంగా అవకాశం కల్పించడం జరిగిందన్నారు. మరో మూడు రోజులు మాత్రమే అవకాశం ఉందని పన్నులు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో ఎం. వెంకటరెడ్డి

బొల్లాపల్లి: మండలంలోని వడ్డెంగుంట, బొల్లాపల్లి, మూగచింతలపాలెం గ్రామ సచివాలయాలను డీఎల్‌డీవో ఎం.వెంకటరెడ్డి మంగళవారం సందర్శించారు. ఆయా సచివాలయాల్లో రికార్డులను తనిఖీ చేసి వాటి పరిధిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందజేయాలన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ సర్వేను సంపూర్ణంగా నిర్వహించాలని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

పిచ్చికుక్క స్వైర విహారం



పిచ్చికుక్కల దాడిలో గాయాలైన దృశ్యం

మాచవరం: మండలంలోని గోవిందాపురం గ్రామంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. వీరిలో ముగ్గురికి శరీర బాగాలపై గాయాలు కాగా చికిత్స నిమితం పిడుగురాళ్లకు తరలించగా, మరో వ్యక్తికి ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో గుంటూరు జీజీహెచ్‌కి తరలించామని గ్రామస్తులు తెలిపారు. గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, పలు మార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, గతంలోనూ వీధి కుక్కలు పలువుర్ని గాయపర్చినట్లు గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల

గురజాల : మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ తిరునాళ్ల మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలేరమ్మను ప్రత్యేక పూలతో అలంకరించారు. వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, మాజీ సర్పంచ్ బండ్ల వెంకయ్య, మాచర్ల బాబు, సాగర్ బాబు, అమావాస్య నాగేశ్వరరావు, కె అంజి, తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ గ్రామంలో కరెంటు ప్రభలు , సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పశువులకు గాలికుంటు టీకాలు



ఆవులకు గాలి కుంటు నిరోధక టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో మంగళవారం పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని మండల పశువైద్యశాఖ నిర్వహించింది. రెండవ రోజు బుధవారం కూడా ఒప్పిచర్ల గ్రామంలోనే పశు వైద్యశిబిరం నిర్వహిస్తామని రైతులు తమ పశువులకు తప్పక టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ డి వెంకటేశ్వర్లు కోరారు. కారెంపూడి గ్రామంలో గురువారం, పెదకొదమగుండ్ల గ్రామంలో శుక్రవారం ప్రత్యేక పశు వైద్యశిబిరం నిర్వహించి పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని తెలిపారు. పశు సంచార వైద్యశాల సిబ్బందితో పాటు క్షేత్ర స్థాయి సిబ్బంది కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

బాలుర వసతి గృహంలో అధికారుల పల్లెనిద్ర

పాల్గొన్న ఆర్డీవో శేషిరెడ్డి, తహసీల్దార్ రమణానాయక్



హాస్టల్‌లో విద్యార్థులతో సమావేశమైన ఆర్డీవో శేషిరెడ్డి, తహసీల్దార్ రమణానాయక్

నరసరావుపేట రూరల్: పల్లెనిద్రలో భాగంగా మంగళవారం రాత్రి ఆర్డీవో ఎం.శేషిరెడ్డి, తహసీ ల్దార్ ఆర్‌వీ రమణానాయక్ పల్నాడురోడ్డు రావిపాడు పంచాయతీ పరిధిలోని రెడ్డినగర్ ఎస్టీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. ఈసందర్భంగా పదోతరగతి, తదితర తరగతుల విద్యార్థులతో సమావేశమయ్యారు. తమకు ఫిజిక్స్ చెప్పేందుకు ట్యూటర్ కావాలని పదోతరగతి విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తప్పకుండా ఏర్పా టు చేస్తామని హామీ ఇచ్చారు. వారితో కలిసి నిద్ర చేశారు. బుధవారం ఉదయాన్ని గ్రామోదయంలో భాగంగా గ్రామంలో పర్యటిస్తామని తహసీల్దార్ వెల్లడించారు.

కేజీబీవీలో తహసీల్దార్ హాస్టల్ నిద్ర

నాదెండ్ల: వసతి గృహాల్లో చదివి ఉన్నత విద్యావంతులై జీవితంలో గొప్పగా రాణిస్తున్న వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని తహసీల్దారు ఏవీ రమణ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్లలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం సందర్శించి హాస్టల్ నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పాఠశాల విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అందుతున్న అల్పాహారం, భోజన మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాధవీలత, ఆర్‌ఐ రమీజా ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య



యువకుడి మృతదేహం

వెల్దుర్తి: ప్రేమ విఫలమై మనస్తాపంతో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని గుండ్లపాడు సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నరసరావుపేట మండలం పాలపాడు గ్రామానికి చెందిన గడిగంట్ల పేరయ్య (18) అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. గత ఆదివారం యువతితో కలిసి వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డి గ్రామానికి వచ్చారు. విషయం తెలుసుకున్న యువతి బంధువులు ఫోన్‌ద్వారా సంప్రదించి మీకు వివాహం జరిపిస్తామని చెప్పి పాలపాడు గ్రామానికి తీసుకెళ్లారు. అనంతరం యువకుడిపై దాడి చేసి పంపించారు. మనస్తాపంతో పేరయ్య తన సోదరుడు గోపి వద్దకు వస్తూ మార్గమధ్యంలో గుండ్లపాడు వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి సోదరుడు గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.